# పశ్చిమాసియాలో భారత వలస కార్మికుల దుర్భర పరిస్థితి

**గల్ఫ్** ప్రాంతంలో సుమారు 8 మిలియన్ల మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో అధికులు పేదరికంతో కూడిన జీవితాల నేపధ్యంలో గల్ఫ్ దేశాలకు వలసబాట పట్టినవారే. ఇక్కడ సంపాదించుకొని, ఆదా చేసుకున్న డబ్బును తమ కుటుంబాలకు పంపటంద్వారా వారిని నికృష్ట పేదరికంనుండి బయటపడవేయాలను కునేవారే.

నైపుణ్యంలేని కార్మికులు సౌదీ అరేబియాకు పనులకోసం వెళ్ళాలంటే సుమారుగా రు.75000/- ఖర్చు అవుతుంది. అదే నర్సులవంటి వృత్తి పనివారికి, వారి నియామకం సందర్భంగా 3 లక్షల రూపాయలు ఖర్చవుతుంది. అక్కడైతే ఎక్కువ సంపాదించుకోవచ్చనే ఆశతో వారు తమకున్న చిన్నపాటి ఆస్తులను తెగనమ్ము కొనిగానీ, స్థానిక వడ్డీ వ్యాపారులవద్ద అత్యధిక వడ్డీలకు అప్పులు తీసుకునిగానీ గల్ఫ్‌దేశాల బాటపడుతున్నారు.

కానీ అక్కడకు చేరగానే వారికి ఉద్యోగమిచ్చిన యజమానులు వారి పాస్‌పోర్టులను లాగేసుకొని, ఒక నిస్సహాయ, దయనీయ స్థితికి వారిని నెడుతున్నారు. అక్కడ వారు నిర్బంధపు చాకిరికి గురవటంతోపాటు, తమ యజమానుల క్రూర దౌర్జన్యాలకు గురవు తున్నారు. ఆ కొత్త దేశంలో వారు దుర్భర నిస్సహాయ స్థితిలో తమ హక్కుల గురించి మాట్లాడే పరిస్థితి వుండదు.

2015 సెప్టెంబరులో భారతదేశానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడిని, సౌదీ సూపర్‌వైజర్ తిడుతున్న వీడియో ఒకటి ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది.

2015 అక్టోబరులో తమిళనాడుకి చెందిన కస్తూరి అనే మహిళ తను పనిమనిషిగా చేసే ఇంటి యజమాని తన కుడిచేతిని నరికేశాడని రిపోర్టుచేసింది.

మరల 2015 డిసెంబరులో కేరళకు చెందిన ముగ్గురు కార్మికులు సౌదీఅరేబియాలో దౌష్ట్యానికి గురయ్యారు. యెమెన్ ఉద్యోగంకొరకు వారు ఒక ఏజంటుకు డబ్బు చెల్లించారు. కానీ వాళ్ళను ఎమెన్‌కు బదులు సౌదీఅరేబియాకు పంపారు. వాళ్ళు శిక్షణ పొందిన ఎలక్ట్రీషియన్లు; కానీ ఒక ఇటుకల ఫ్యాక్టరీలో పనిచేయవలసిందిగా వారిని నిర్బంధించారు. వారు నిరాకరించినందుకు యజమాని వారిని కట్టెతో బాదాడు. దీనినంతా కెమెరాతో రికార్డు చేసి, వారు తమ కుటుంబాలకు పంపించారు.

గల్ఫ్ దేశాలలో భారత కార్మికులకు సంబంధించి మోసం, కుట్ర, దురాగతాల కథలు మాత్రమే కాదు. అనేకమంది భారత మహిళా కార్మికులు లైంగిక వేధింపులకు, హింసకు గురవుతున్నారు. అనేకమంది భారత కార్మికులు తప్పుడు కేసుల్లో ఇరికించబడి జైళ్ళల్లో మగ్గుతున్నారు.

భారత విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ ప్రకారం ఒక్క 2015లోనే గల్ఫ్ దేశాలలో 74,000 మంది భారత కార్మికులు తమపై సాగుతున్న దోపిడి గురించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేయని కేసులెన్ని ఉన్నాయో తెలియదు. సౌదీఅరేబియా నుండి 2472, కువైట్‌నుండి 3236, బెహరిన్ నుండి 806, ఒమన్ నుండి 413, ఖతార్‌నుండి 378, యుఎఇ నుండి 126 ఫిర్యాదులు 2015లో వచ్చాయి. ఇంకా వేధింపులకు, దౌర్జన్యాలకు సంబంధించి అనేక గాథలు వెలుగులోకి రావటంలేదు.

భారత పాలకులు మాత్రం విదేశీ మారక ద్రవ్య నిల్వలు పెరగటంగురించో, వుండటంగురించో మాత్రమే మాట్లాడతారు. ఎందుకంటే తాము సక్రమంగా పాలన సాగిస్తున్నామన్నదానికి, ఆర్థిక విధానాలు సరిగా నిర్వహిస్తున్నామన్న దానికి అదే రుజువన్నట్లు. అంతేకాక వారు ప్రతి సంవత్సరం 'ఎన్నారైదివస్' ఉత్సవాలను అత్యంత అట్టహాసంగా నిర్వహిస్తూ, కొంతమంది పేరు ప్రఖ్యాతులు సంపాదించిన ఎన్నారైలను ప్రదర్శక నమూనాలుగా చూపిస్తూ, వారికి సత్కారాలను చేస్తున్నారు. కానీ నిజమైన ఎన్నారైలు వాళ్ళు కానేకాదు. పశ్చిమాసియాలో వుంటున్న భారత వలస కార్మికులే నిజమైన ఎన్నారైలు. వారు పంపిస్తున్న విదేశీ మారక ద్రవ్యంవల్ల మాత్రమే భారత దేశపు విదేశీ మారకనిల్వల స్థాయి నిలకడగా వుంటోంది. 2014లో గల్ఫ్‌దేశాల నుండి భారతదేశానికి వచ్చిన డబ్బు 32.7 బిలియన్ డాలర్లు కాగా, అమెరికా నుండి వస్తున్నది కేవలం 10 బిలియన్ డాలర్లు మాత్రమే. అందుకే నిజమైన ఎన్నారైలు ఎవరంటే, వాళ్ళు పశ్చిమాసియా దేశాలలోని వలస కార్మికులే.

భారతదేశం ఆరు గల్ఫ్ దేశాలతో అవగాహనా ఒప్పందంలో ఉన్నప్పటికీ, ఆ దేశాలలోని వలసకార్మికుల రక్షణకు సంబంధించి, సంక్షేమానికి సంబంధించి ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ఏదో సందర్భం ఎదురైనప్పుడు మాత్రమే కంటితుడుపు చర్యలు చేపడుతూ, వారి గురించి ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నట్లు పోజులిస్తోంది. చాలామంది కార్మికులు అక్కడ అనాధలుగా చనిపోతున్నారు. ఇంకెంతోమంది జైళ్ళల్లో మగ్గుతున్నారు. కానీ మన ప్రభుత్వంమాత్రం చనిపోయిన వారి శవాలను స్వస్థలానికి తెప్పించటానికిగానీ, జైళ్ళల్లో వున్నవారి విడుదలకుగానీ ఏవిధమైన చొరవనూ చూపించటంలేదు. కొన్ని ఎన్జీవోసంస్థలు, మానవతావాద సంస్థలు మాత్రమే ఈ నిర్భాగ్యులకు సహాయం చేస్తున్నారు.

భారత దేశానికి విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూరుస్తున్న గల్ఫ్ దేశాలలోని భారత వలస కార్మికుల దుస్థితి ఇది.

oooooo